కాంగ్రెస్‌లో సంక్షోభం

వరుసగా పార్టీని వీడుతున్న సీనియర్లు

- త్వరలోనే హస్తానికి కమల్‌నాథ్ గుడ్‌బై!
- అదే బాటలో పార్టీ ఎంపీ మనీశ్ తివారీ?
- ఇప్పటికే కాంగ్రెస్‌ను వీడిన మహారాష్ట్ర మాజీ సీఎం చవాన్, మిలింద్ దేవ్‌రా
- గత పదేండ్లలో హస్తం పార్టీకి తొమ్మిది మంది మాజీ ముఖ్యమంత్రుల గుడ్‌బై

న్యూఢిల్లీ/భోపాల్, ఫిబ్రవరి 18: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. గతంలో సీఎంలుగా, కేంద్ర మంత్రులుగా చేసిన సీనియర్ నేతలు ఒక్కొక్కరిగా ఆ పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. ఇటీవలి కాలంలో మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, మాజీ ఎంపీ మిలింద్ దేవ్‌రా వంటి నేతలు కాంగ్రెస్‌ను వీడగా.. తాజాగా ఆ జంపింగ్ లిస్టులో మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్‌తోపాటు పార్టీలో సీనియర్ నేతగా ఉన్న ఎంపీ మనీశ్ తివారీ పేర్లు కూడా రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పంజాబ్‌లోని ఆనంద్‌పూర్ లోక్‌సభ నియోజకవవర్గ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న తివారీ.. బీజేపీతో టచ్‌లో ఉన్నారని, ఆయన లోక్‌సభ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌ను వీడి బీజేపీతో చేరనున్నారనే వార్తలు గుప్పుమన్నాయి. మనీశ్ తివారీ బీజేపీ టికెట్‌పై లూథియానా స్థానం నుంచి పోటీచేసేందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతున్నది.

కమల్‌నాథ్

మనీశ్ తివారీ

ఢిల్లీ చేరుకొన్న కమల్‌నాథ్ వర్గం ఎమ్మెల్యేలు

బీజేపీలో చేరేందుకు మాజీ సీఎం కమల్‌నాథ్ తన కుమారుడు, ఎంపీ నకుల్‌నాథ్‌తో కలిసి ఢిల్లీ చేరుకొన్నారని ఓవైపు ప్రచారం జరుగుతుండగా.. ఇందుకు బలం చేకూర్చేలా కీలక పరిణామం చోటుచేసుకొన్నది. కమల్‌నాథ్‌కు విధేయులుగా భావించే మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదివారం ఢిల్లీ చేరుకొన్నారు. చింధ్వారా రీజియన్‌కు చెందిన వీరంతా కమల్‌నాథ్‌తో కలిసి కమలం పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్యాంపులో మాజీ మంత్రి లఖన్ గంగోరియా కూడా ఉన్నట్టు తెలుస్తున్నది. వీరంతా కాంగ్రెస్ అగ్రనేతల ఫోన్లకు స్పందించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా పార్టీ ఎమ్మెల్యేలను తమ వెంట తీసుకెళ్లేందుకు కమల్‌నాథ్ వర్గం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

పీసీసీ అధ్యక్షుడిగా తొలగింపుపై అసంతృప్తి

మాజీ సీఎం కమల్‌నాథ్ చింధ్వారా స్థానం నుంచి తొమ్మిది సార్లు ఎంపీగా చేశారు. ప్రస్తుతం అదే చింధ్వారా ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర ఓటమితో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన్ను పీసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పించింది. పీసీసీ అధ్యక్షుడిగా తొలగించిన విధానంపై కమల్‌నాథ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి, కమల్‌నాథ్ సన్నిహితుడు దీపక్ సక్సేనా పేర్కొన్నారు. తమ నాయకుడు ఏ నిర్ణయం తీసుకొన్నా, ఆయన వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. తాను కూడా కమల్‌నాథ్ బాటలోనే పయనిస్తానని మరో మాజీ మంత్రి విక్రమ్ వర్మ ఎక్స్‌లో పోస్టు చేశారు.

కాంగ్రెస్ నుంచి బయటకు సీనియర్లు

కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నేతలు వరుసకట్టి బయటకు వెళ్తున్నారు. మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్‌తో సహా గత పదేండ్లలో ఏకంగా తొమ్మిది మంది మాజీ ముఖ్యమంత్రులు హస్తానికి రాంరాం చెప్పారు. ఈ జాబితాలో అమరిందర్ సింగ్(పంజాబ్), గులాం నబీ ఆజాద్(జమ్ముకశ్మీర్), విజయ్ బహుగుణ(ఉత్తరాఖండ్), అజిత్ జోగి(చత్తీస్‌గఢ్), ఎస్ఎం కృష్ణ(కర్ణాటక), నారాయణ్ రాణే(మహారాష్ట్ర), గిరిధర్ గమాంగ్ (ఒడిశా) ఉన్నారు. అశోక్ చవాన్ గత వారం కాంగ్రెస్‌ను వీడగా.. గత నెల జనవరిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు సన్నిహితుడు, మాజీ ఎంపీ మిలింద్ దేవ్‌రా కూడా బయటకు వెళ్లిపోయారు. పార్టీ నాయకత్వం నుంచి గాంధీ కుటుంబం తప్పుకొని, ఇతర నేతలకు అవకాశం ఇవ్వాలని 2022లో డిమాండ్ చేసిన సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి కపిల్ సిబల్.. తర్వాత రెండు నెలలకే కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. ఇంకా ఆ పార్టీని వీడిన వారిలో పంజాబ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు సునీల్ జక్కర్, జ్యోతిరాదిత్య సింధియా, సుస్మితా దేవ్, ఆర్పీఎన్ సింగ్, అశ్విని కుమార్, హార్దిక్ పటేల్ వంటి నేతలు ఉన్నారు.

ఆదివారం పంజాబ్‌లోని శంభు సరిహద్దుల్లో అన్నదాతల నిరసన

21న నల్లజెండాలతో నిరసన

- అధికార ఎన్డీయే ఎంపీలకు వ్యతిరేకంగా ఆందోళనలు
- పంజాబ్‌లో బీజేపీ నాయకులను ఘిరావ్ చేయాలి
- రైతులకు ఎస్కేఎం పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమ విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) ఆందోళనకు పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఈ నెల 21న బీజేపీతో సహా అధికార ఎన్డీయే పక్ష ఎంపీలకు వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసనలు తెలుపాలని రైతులకు సూచించింది. మరోవైపు పంజాబ్‌లో బీజేపీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షుల ఇండ్ల ముందు ఈనెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు 24 గంటల ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎస్కేఎం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని బీజేపీ 2014 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, అయితే మోదీ సర్కార్ మోసం చేస్తున్నదని విమర్శించింది. ఈనెల 21న ఉత్తరప్రదేశ్‌లోని అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్ల మార్చ్ నిర్వహించనున్నట్టు బీకేయూ ప్రకటించింది. రైతుల ఆందోళనకు మద్దతుగా 26, 27 తేదీల్లో రైతులు తమ ట్రాక్టర్లను ఢిల్లీకి వెళ్లే హైవేలపై పార్క్ చేస్తారని తెలిపింది. ట్రాక్టర్ల ర్యాలీలో భారీయెత్తున రైతులు పాలుపంచుకోవాలని రైతు నేత రాకేశ్ టికాయిత్ పిలుపునిచ్చారు. మరోవైపు, రైతుల చలో ఢిల్లీ మార్చ్ ఆదివారం ఆరో రోజుకు చేరుకున్నది. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో వందల మంది రైతులు నిరసన కొనసాగిస్తున్నారు.

నాలుగో దఫా చర్చలు

తాజాగా మరోసారి రైతాంగం ఉద్యమం చేపట్టిన నేపథ్యంలో కేంద్రం రైతు నేతలతో చర్చలు జరుపుతున్నది. ఇప్పటికే ఈనెలలో 8, 12, 15 తేదీల్లో మూడు సార్లు ముగ్గురు కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా, నిత్యానంద్ రాయ్ రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం కాగా.. ఆదివారం చండీగఢ్‌లో రైతు నేతలతో మరోసారి భేటీయై చర్చలు జరిపారు.

ఇంటర్నెట్‌పై నిషేధం కొనసాగింపు

రైతుల ఆందోళన నేపథ్యంలో ఆంక్షలు కొనసాగుతున్నాయి. హర్యానాలోని ఏడు జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలపై నిషేధాన్ని ఈనెల 19 వరకు పొడిగించారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు పంజాబ్‌లో పటియాలా, సంగ్రూర్, ఫతేగఢ్ సాహిబ్ తదితర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్ సేవల రద్దును 24 వరకు పొడిగించారు.

వెంటనే ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలి

కేంద్ర ప్రభుత్వం కాలయాపన విధానాలు మానుకొని, లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే కంటే ముందే ఎంఎస్పీకి చట్టబద్ధతతో సహా రైతుల ఇతర డిమాండ్లను పరిష్కరించాలని రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ డిమాండ్ చేశారు. పంజాబ్-హర్యానా సరిహద్దు శంభు వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో కేంద్రం చర్చలు చేస్తున్నట్టు కనిపించడం లేదని అన్నారు. ఎంఎస్పీకి చట్టబద్ధతకు ఒక ఆర్డినెన్స్, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలుకు ఒక నోటిఫికేషన్ ఇవ్వడం ద్వారా కేంద్రం పరిష్కారం చూపొచ్చని అభిప్రాయపడ్డారు. డిమాండ్లు నెరవేర్చే వరకు రైతులు వెనక్కు వెళ్లేది లేదని స్పష్టం చేశారు.

కోటాలో మరో విద్యార్థి అదృశ్యం

- వారంలో రెండో ఘటన

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి అదృశ్యమయ్యాడు. శికర్ జిల్లాకు చెందిన విద్యార్థి యువరాజ్ (18) నీట్ మెడికల్ ఎంట్రన్స్ కోసం ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నాడు. శనివారం ఉదయం 7 గంటలకు ట్రాన్స్‌పోర్ట్ నగర్‌లోని హాస్టల్ నుంచి కోచింగ్ సెంటర్‌కు బయల్దేరిన యువరాజ్ ఆచూకీ తర్వాత తెలియలేదు. అతను తన మొబైల్ ఫోన్‌ను హాస్టల్‌లోనే వదిలేశాడు. వారం రోజుల క్రితం రచిత్ సోంధ్య (16) అనే విద్యార్థి కూడా కోటా నుంచి అదృశ్యమయ్యాడు. రచిత్ జేఈఈ కోసం మధ్యప్రదేశ్ నుంచి వచ్చి, ఇక్కడ శిక్షణ పొందుతున్నాడు. గత సోమవారం గరడియా మహదేవ్ దేవాలయానికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ రచిత్ మొబైల్ ఫోన్, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ యువకుడి ఆచూకీ కూడా ఇప్పటికీ తెలియలేదు.

బీజేపీ అధ్యక్షుడు నడ్డా పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం పొడిగించారు.దీంతో నడ్డా ఈ ఏడాది జూన్ వరకు అంటే సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా జనవరిలో ఈ మేరకు చేసిన ప్రతిపాదనకు ఢిల్లీలో రెండ్రోజులుగా జరుగుతున్న బీజేపీ జాతీయ మండలి సమావేశం ఆదివారం ఆమోదం తెలిపింది. బీజేపీ అధ్యక్షుడిగా నడ్డా 2020లో బాధ్యతలు చేపట్టారు.

జైన ముని విద్యాసాగర్ కన్నుమూత

రాయ్‌పూర్, ఫిబ్రవరి 18: జైన మతానికి చెందిన ప్రఖ్యాత ధర్మకర్త ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ తుది శ్వాస విడిచారు. చత్తీస్‌గఢ్‌లోని డోంగర్‌గఢ్ తీర్థంలో గత కొన్ని రోజులుగా ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ దీక్షలో ఉన్నారు. దీక్షలో ఉండగానే అనారోగ్యానికి గురయ్యారు. జైన సంప్రదాయం ప్రకారం ఆచార్య సల్లేఖన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఉన్నవారు ఆహార, పానీయాలు ముట్టరు. ఆ విధంగా ఆయన ఆదివారం చివరి శ్వాస వదిలారు. ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. ఆయన మృతి దేశానికి తీరని లోటని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించటానికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. నిరుడు డోంగర్‌గఢ్ తీర్థాన్ని సందర్శించిన ప్రధాని ఆచార్య ఆశీస్సులు అందుకున్నారు.

లబ్ధిదారుల ఆధార్‌ను కేంద్రం డీయాక్టివేట్ చేస్తున్నది: మమత

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ పథకాలు సక్రమంగా అమలు కాకుండా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. బీర్భూమ్ జిల్లాలో ఆదివారం జరిగిన ప్రజా పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఆధార్ కార్డులను మోదీ సర్కారు డీయాక్టివేట్ చేసిందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రజలు ఉచిత రేషన్, బ్యాంకుల ద్వారా లక్ష్మీ భండార్ పథకం ప్రయోజనాలను పొందకూడదనేదే కేంద్రం ఉద్దేశమని, దీనిని తెలుసుకోవాలని ప్రజలను కోరారు. తన ప్రభుత్వం ఆధార్ కార్డు లేనివారికి సైతం పథకాలను అందించడం కొనసాగిస్తుందని భరోసా ఇచ్చారు. ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు.

మధ్యప్రదేశ్ అడవిలో వందలాది ఆవుల మృతదేహాలు

భోపాల్: మధ్య ప్రదేశ్‌లోని సిల్లెర్‌పూర్ గ్రామం సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో దాదాపు 500 ఆవుల మృతదేహాలు కనిపించాయి. దీంతో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇవన్నీ ఇక్కడికి ఎలా వచ్చాయో తెలియడం లేదు. వీటిని పట్టణ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి, ఇక్కడ పడేసి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. సిల్లెర్‌పూర్ గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, తాను అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ వడిల్ మాట్లాడుతూ, ఈ అటవీ ప్రాంతం ఆవుల మృతదేహాల డంపింగ్ యార్డుగా మారిపోయిందన్నారు. కరైనా పురపాలక సంఘం ప్రాంతం నుంచి వీటిని తీసుకొచ్చి, ఇక్కడ పడేస్తున్నారన్నారు.

భారత్‌ను మత దేశంగా మారుస్తున్నారు

- ప్రధానిపై కేరళ సీఎం విమర్శలు

కేరళ: లౌకిక దేశమైన భారత్‌ను పథకం ప్రకారం మత రాజ్యంగా మలుస్తున్నారని కేరళ సీఎం పినరయి విజయన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కరీపూర్‌లో జరిగిన 10వ ముజాహిద్ స్టేట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానిపై పరోక్షంగా విమర్శలు చేశారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు మతపరమైన వేడుకల్లో పూజారులుగా మారుతున్నారని విమర్శించారు. ఇందుకు ఉదాహరణగా ఇటీవల అయోధ్యలో జరిగిన శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పేర్కొన్నారు. కేంద్రంలోని పెద్దలు మత సంస్థలకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న హద్దులను చెరిపేస్తున్నారని అన్నారు.

దేశాన్ని చీల్చేందుకు కాంగ్రెస్ కుట్ర

- బీజేపీ జాతీయ సమావేశాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రాంతం, భాష పరంగా కాంగ్రెస్ పార్టీ దేశాన్ని చీల్చాలనుకొంటున్నదని ప్రధాని మోదీ విమర్శించారు. బంధుప్రీతి, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలకు ఆ పార్టీ తల్లి వంటిదని అన్నారు. బీజేపీ జాతీయ సదస్సు సందర్భంగా ఆదివారం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. 'వికసిత్ భారత్' కోసం విపక్షాల వద్ద రోడ్‌మ్యాప్ లేదని, దాన్ని బీజేపీ మాత్రమే సాధించగలదని పేర్కొన్నారు. తనను దూషించడం, తప్పుడు ఆరోపణలు చేయడమనే ఒకేఒక్క అజెండాతో కాంగ్రెస్ పనిచేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కోలుకోలేని నష్టం జరుగుతుందన్నారు. వరుసగా మూడోసారి కూడా అధికారం చేపట్టబోతున్నామని విశ్వాసం వ్యక్తం చేసిన మోదీ.. రానున్న 100 రోజులు చాలా కీలకమైనవని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 400 సీట్లు దాటేలా నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాగా, అత్యవసర సమయాల్లో పార్టీ అధ్యక్ష పదవీ కాలం, పొడగింపుపై నిర్ణయం తీసుకొనే అధికారాన్ని బీజేపీ పార్లమెంటరీ బోర్డుకు అప్పగిస్తూ బీజేపీ జాతీయ సదస్సు పార్టీ రాజ్యాంగంలో మార్పులు చేసింది. ఈ మేరకు సంబంధిత ప్రతిపాదనను ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్ ప్రవేశపెట్టారు.

ప్రయాణికుల లగేజీని 30 నిమిషాల్లో చేరవేయాలి

విమానయాన సంస్థలకు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఎయిర్‌పోర్టుల్లో విమానాల నుంచి దిగిన ప్రయాణికులకు త్వరగా వారి బ్యాగేజీ అందేలా చూడాలని, 30 నిమిషాల్లోగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ఏడు షెడ్యూల్డ్ విమానయాన సంస్థలను ఆదేశించింది. విమాన ప్రయాణికులు తమ లగేజీని పొందడం ఆలస్యమవుతున్నట్టు ఫిర్యాదులు వస్తుండటంతో బీసీఏఎస్ ఈ నెల 16న ఎయిర్ ఇండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్, విస్తారా, ఏఐఎక్స్ కనెక్ట్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలకు ఈ ఆదేశాలు జారీ చేసింది.

- వధువు కావలెను..

మధ్యప్రదేశ్‌లోని దామోహ్‌లో ఓ 29 ఏండ్ల యువకుడు తనకు వధువు కావాలని కోరుతూ తన ఈ-రిక్షాకు ఇలా హోర్డింగ్ తగిలించాడు. తన ఎత్తు, పుట్టిన తేదీ, గోత్రం వంటి వివరాలు పేర్కొంటూ కులమతాలకు అతీతమని కూడా ప్రకటించుకున్నాడు. ప్రస్తుతం వధువు దొరకడం కష్టంగా మారిందని, దీంతో ఇలా హోర్డింగ్ ఏర్పాటుచేసినట్టు చెప్పాడు.

చండీగఢ్ బీజేపీ మేయర్ సోన్కర్ రాజీనామా

సుప్రీం విచారణ వేళ కీలక పరిణామం

చండీగఢ్: ఇటీవల వివాదాస్పదమైన చండీగఢ్ మేయర్ ఎన్నిక ఎపిసోడ్‌లో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. గత నెల 30న భారీ హైడ్రామా మధ్య జరిగిన మేయర్ ఎన్నికలో ప్రిసైడింగ్ అధికారి విజేతగా ప్రకటించిన బీజేపీ నేత మనోజ్ సోన్కర్ ఆదివారం రాత్రి తన పదవికి రాజీనామా చేశారు. చండీగఢ్ మేయర్ వివాదంపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేయనున్న నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకొన్నది. ఢిల్లీలో సమావేశం తర్వాత పార్టీ అగ్రనేతల సూచన మేరకు ఈ నిర్ణయం జరిగినట్టు తెలుస్తున్నది. మేయర్ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఆరోపిస్తూ ఆప్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

సుప్రియా సూలేపై అజిత్ పవార్ భార్య పోటీ!

ముంబై, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో శరద్ పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో ఈసారి వదిన, ఆడపడుచుల మధ్య రసవత్తరమైన పోటీ జరుగనున్నదనే ప్రచారం సాగుతున్నది. ఆ స్థానంలో ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలేపై పోటీకి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తన భార్య సునేత్ర పవార్‌ను నిలబెట్టనున్నారనే వార్త చక్కర్లు కొడుతున్నది. ఇటీవల బారామతిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో అజిత్ పవార్‌తో సునేత్ర ఫొటోలు కనిపించడం ఈ ప్రచారానికి బలం చేకూరుస్తున్నది. దీనిపై సుప్రియా సూలే ఆదివారం స్పందిస్తూ ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎన్నికల్లో పోటీచేయవచ్చన్నారు.

చిక్కుల్లో చంపయీ సర్కార్

క్యాబినెట్ బెర్త్‌లపై కాంగ్రెస్‌లో అసంతృప్తి

- నలుగురు పార్టీ ఎమ్మెల్యేలకు తిరిగి మంత్రి పదవులివ్వడంపై అసమ్మతి
- 12 మంది ఎమ్మెల్యేల అభ్యంతరం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: జార్ఖండ్ ప్రభుత్వంలో మరో ముసలం పుట్టింది. ఇటీవలే ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన చంపయీ సోరేన్‌కు కొత్త తలనొప్పి వచ్చి పడింది. సోరెన్ తన క్యాబినెట్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఆలంగిర్ ఆలమ్, రామేశ్వర్ ఓరోన్, బన్నాగుప్తా, బాదల్ పత్రలేకఖ్‌కు మరోసారి చోటివ్వటంతో మిగిలిన వారిలో అసంతృప్తి రగిలింది. ముందుగా మంత్రుల ప్రమాణస్వీకారాన్నే బహిష్కరించి తమ నిరసనను తెలియచేయాలనుకున్నారు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. కానీ తర్వాత వ్యూహం మార్చుకుని హైకమాండ్ దగ్గరే అమీతుమీ తేల్చుకోవటానికి 12 మంది ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లారు. జార్ఖండ్ మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జేఎంఎంకు 29 మంది ఎమ్మెల్యేల బలం ఉండగా.. కాంగ్రెస్‌కు 17 మంది ఎమ్మెల్యేలున్నారు. మంత్రివర్గ కూర్పులో తమకు తగిన ప్రాధాన్యం ఉండాలని కాంగ్రెస్ అసంతృప్త ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఒకరికి ఒక పదవే ఉండాలని వారు కోరుతున్నారు. ఆలంగిర్ ఆలమ్‌కు మంత్రిగా కొనసాగాలనుకుంటే సీఎల్‌పీ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. వారిని శాంతింప చేయటానికి జేఎంఎం మంత్రి బసంత్ సొరేన్ రాంచీలో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రభుత్వంలో ఎలాంటి గందరగోళం లేదని, తామంతా ఐక్యంగా ఉన్నామని బసంత్ సొరేన్ వ్యాఖ్యానించారు. అయితే అసంతృప్త ఎమ్మెల్యేలు తమ డిమాండ్లను నెరవేర్చకపోతే రాబోయే అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. జేఎంఎం ఎమ్మెల్యేలలో కొత్త వారికి మంత్రివర్గంలో స్థానం కల్పించినప్పుడు కాంగ్రెస్ తరుపున కూడా అవకాశం కల్పించవచ్చు కదా అని వారు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు దీపికా పాండే సింగ్ స్పందిస్తూ క్యాబినెట్‌లో మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కేవలం ఒక్కరికే అవకాశం కల్పించటాన్ని ఎవరూ సమర్థించరని వాదించారు. కాంగ్రెస్ హైకమాండ్ దృష్టికి అసమ్మతి స్వరాలు వినిపించారు. ఈ విషయంలో కల్పించుకోవాలని కేసీ వేణుగోపాల్‌ను కోరినట్టు మందార్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శిల్పి నేహా టిర్కీ చెప్పారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని జార్ఖండ్ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ రాజేశ్ ఠాకూర్ తెలిపారు. త్వరలో దీన్ని కేంద్ర నాయకత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. జార్ఖండ్‌లో జరుగుతున్న సంఘటనలను ప్రతిపక్షాలు నిశితంగా గమనిస్తున్నాయి. బీజేపీ, ఏజేఎస్‌యూ పార్టీలు పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాయి.

ఖర్గేతో చంపయీ భేటీ

కొత్త క్యాబినెట్‌పై విభేదాల నేపథ్యంలో జార్ఖండ్ సీఎం చంపయీ సోరేన్ ఢిల్లీలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. మంత్రివర్గ కూర్పుపై జేఎంఎం, కాంగ్రెస్ మధ్య విభేదాలు అంశంపైనే సోరేన్‌తోపాటు జార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్ కూడా ఖర్గేతో సమావేశమయ్యారు. మంత్రివర్గంపై అసమ్మతి వ్యక్తం చేసిన 12 మంది ఎమ్మెల్యేలు కూడా ప్రస్తుతం ఢిల్లీలోనే మకాం వేశారు. తన ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి సోరేన్ మాట్లాడుతూ తాను సీఎం అయ్యాక తొలిసారి ఢిల్లీకి వచ్చానని చెప్పారు. ఖర్గేతో ఆయన భేటీకి ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేల అసమ్మతి గురించి అడగ్గా.. అది కాంగ్రెస్ అంతర్గత వ్యవహారమని, వారి పార్టీనే పరిష్కరించుకుంటుందని, దాని గురించి తాను చెప్పేది ఏమీ లేదని పేర్కొన్నారు. ఇటు జేఎంఎంలో కానీ, అటు కాంగ్రెస్‌లో కానీ విభేదాలు ఏమీ లేవని.. అంతా బాగుందని చెప్పారు. జార్ఖండ్‌లో చంపయీ క్యాబినెట్‌లో 8 మంది మంత్రులు శనివారం ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. దీనిపైనే కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

కుష్వాహా కొత్త పార్టీ 'రాష్ట్రీయ లోక్ మంచ్'

పాట్నా, ఫిబ్రవరి 18: బీహార్‌లో మరో కొత్త పార్టీ ఆవిర్భవించింది. కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుష్వాహా ఈ కొత్త పార్టీకి నేతృత్వం వహిస్తున్నారు. జేడీయూ అధ్యక్షుడు, బీహార్ సీఎం నితీశ్ కుమార్‌తో విడిపోయాక ఉపేంద్ర కొత్త పార్టీని స్థాపించారు. పార్టీ పేరును రాష్ట్రీయ లోక్ మంచ్ అని వెల్లడించారు. తొలుత తాము రాష్ట్రీయ లోక్ జనతాదళ్ అనే పేరును సూచించామని, అయితే ఎన్నికల సంఘం మరికొన్ని పేర్లు సూచించాలని కోరిందని, చివరగా రాష్ట్రీయ లోక్ మంచ్ పేరు ఖరారు చేసిందని ఉపేంద్ర వెల్లడించారు.

సీఏఎఫ్ కమాండర్‌ను నరికి చంపిన నక్సల్స్

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్స్ ప్రాబల్యంగల బీజాపూర్‌లో ఆదివారం దారుణం జరిగింది. కుట్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో సంత జరుగుతుండగా, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (సీఏఎఫ్) బృందం భద్రతా విధులను నిర్వహిస్తున్నది. నక్సలైట్లు ఉదయం 9.30 గంటల ప్రాంతంలో